


4,35,557 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో 5,68,287 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 4,35,557 కార్డులను పంపిణీ చేశామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.మురళీనాథ్ తెలిపారు. ఇంకా 1,32,754 కార్డులు లబ్ధిదారులకు అందించాల్సి ఉందన్నారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన స్మార్ట్ కార్డులను అందరికీ ఈ నెలాఖరులోగా అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులో క్యూఆర్ కోడ్ ఉండడం వల్ల లబ్ధిదారుల వివరాలన్నీ అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లాలో 1249 రేషన్ డిపోల ద్వారా స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే విజయనగరం మండలం, అర్బన్‌లో పూర్తిస్థాయిలో పంపిణీ చేశామని చెప్పారు. ప్రస్తుతానికి స్మార్ట్ కార్డు ద్వారా బియ్యం, పంచదార అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 11 ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా సరుకులను సరఫరా చేస్తున్నామని తెలిపారు. 7,04,273 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, ఇందులో 5,02,634 దీపం కనెక్షన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.

సమరోత్సాహం



అభివాదం చేస్తున్న నాయకులు

- ఘనంగా సిఐటియు జిల్లా మహాసభ ప్రారంభం
- రాజాంలో భారీ ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న సిఐటియు నాయకులు, కార్మికులు, కర్షకులు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి, రాజాం

సిఐటియు 11వ జిల్లా మహాసభ ఆదివారం సమరోత్సాహంతో ప్రారంభమైంది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కార్మికులు, కర్షకులు ఎర్రజెండాలు చేబూని రాజాం పట్టణంలో కదం తొక్కారు. రాజాం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి బొబ్బిలి రోడ్డు మీదుగా చీపురుపల్లి రోడ్డులోని శ్రీసాయి నటరాజ్ కల్యాణ మండపం వద్ద ఏర్పాటుచేసిన మహాసభ వేదిక వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాదిగా కదలివచ్చిన కార్మికవర్గ సమర నినాదంతో రాజాం మెయిన్‌రోడ్డు మార్మోగింది. ఎరుపు జెండాలు, అలంకరించిన తోరణాలతో రోడ్డంతా ఎర్రబారింది. ఎర్ర జెండాలతో 11 మంది మహిళా కార్మికుల కవాతు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జిల్లా వ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన కార్మికులు, స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కలయిక, పరస్పర కరచాలనాలతో మహాసభ ప్రాంగణం ఎంతో సందడిగా కనిపించింది. 'వర్ధిల్లాలి కార్మికుల ఐక్యత, రైతులకు యూరియా అందుబాటులోకి తేవాలి, లేబర్ కోడ్‌లు రద్దుచేయాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, తదితర స్కీమ్ వర్కర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి' అంటూ ప్రదర్శనలో కార్మికులంతా ఏకోన్ముఖంగా చేసిన నినాదాలతో రాజాం పట్టణం దద్దరిల్లింది. ర్యాలీలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ అగ్రభాగాన నిలిచారు. ప్రతినిధుల సభకు ముందు మహాసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిఐటియు పతాకాన్ని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాజాం ఐసిడిఎస్ ప్రాజెక్టు నాయకులు రూప ఆవిష్కరించారు. మహాసభ జరిగిన ప్రాంతానికి సిపిఎం జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి, కీర్తిశేషులు సీతారాం ఏచూరి నగర్‌గాను, మహాసభ వేదికకు సిఐటియు నేత, కీర్తిశేషులు విజికె మూర్తి ప్రాంగణంగాను నామకరణం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు అధ్యక్షతన జరిగిన మహాసభలో సిహెచ్ నర్సింగరావు, సుబ్బరావమ్మ, తమ్మినేని ప్రారంభ ఉపన్యాసం చేశారు. ప్రతినిధుల సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్.. గడిచిన మూడేళ్ల పోరాటాలు, విజయాలు, సిఐటియు ఎదుర్కొన్న సవాళ్ల సహ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై రాత్రి వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు చర్చించారు.

కార్మిక వర్గ రాజ్యంతోనే సమానత్వం

- కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న మోడీ ప్రభుత్వం
- బిజెపికి భజన చేస్తున్న టిడిపి, జనసేన, వైసిపి
- సిఐటియు జిల్లా మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, రాజాం

కార్మికవర్గ రాజ్యంతోనే సమానత్వం, ఉద్యోగ భద్రత, మెరుగైన వేతనాలు, అందరికీ విద్య, వైద్య తదితర ఉచిత సదుపాయాలు సాధ్యమౌతాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు స్పష్టంచేశారు. నేటి బిజెపి ప్రభుత్వం దేశ సంపదను, వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ కార్మికవర్గాన్ని పూర్తిగా విస్మరిస్తోందని విమర్శించారు. ఇటువంటి ద్రోహానికి పాల్పడుతున్న బిజెపికీ, ప్రధాని మోడీకీ రాష్ట్రంలోని గత, ప్రస్తుత పాలక పార్టీలన్నీ (టిడిపి, జనసేన, వైసిపి) భజన చేస్తున్నాయని విమర్శించారు. ఫలితంగా ఆ ప్రభావం విజయనగరం జిల్లాలోని కార్మికవర్గంపైనా పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖలో రూ.వేల కోట్ల విలువ చేసే భూములను లూలూ మార్టుకు 99 పైసలకే కట్టబెడుతున్న ప్రభుత్వం పేదలపై మాత్రం ఎన్నో రకాలుగా భారాలు మోపుతోందన్నారు. తాజాగా పెంచిన విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల వల్ల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, వ్యాపారులపై తీవ్రంగా భారం పడుతుందని, దీనివల్ల పరోక్షంగా ప్రజలపై భారాలు పెరుగుతున్నాయని వివరించారు. ఇప్పటికే విద్యుత్ ఛార్జీల్లో రాయితీలు కల్పించక పోవడం వల్ల జిల్లాలో అత్యధికంగా ఉన్న ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడ్డాయని, దీనివల్ల వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటం తరువాత చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర మూల్యం చెల్లించుకుందని, ఆ దెబ్బతో 20 ఏళ్లపాటు ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఛార్జీల పెంపునకు సాహసించలేదని వివరించారు. మోడీ ఒత్తిడికి లొంగిన వైసిపి ప్రభుత్వం కూడా రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలు చేయడం వల్ల గత ఎన్నికల్లో తీవ్రంగా నష్టపోయిందని గుర్తుచేశారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు వంటి స్కీమ్ వర్కర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు పోరాడుతుంటే, ఈ పనులను ప్రయివేటు పరం చేసేందుకు కేంద్రం కుట్రచేస్తోందని దుయ్యబట్టారు. అంబానీ, అదానీలపై 1 శాతం పన్ను పెంచితే రాష్ట్రంలోని కార్మికులందరికీ కనీసం రూ.30 వేల వేతనం అమలు చేయవచ్చని, అందుకు మాత్రం మోడీ, అమిత్‌షా ముందుకు రావడం లేదని విమర్శించారు. రైల్వే, ఆర్మీ వంటి రంగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను శాశ్వత ప్రాతిపదికన భర్తీచేయకపోవడం వల్ల డిగ్రీ, ఆపైన చదువుకున్న వారు కూడా నిరుద్యోగులుగా ఉండిపోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ

మూతపడిన పరిశ్రమలు తెరిపించాలి : తమ్మినేని

జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తెరిపించాల్సిన జిల్లాకు చెందిన మంత్రి, పాలకపార్టీల పెద్దలు కొత్త పరిశ్రమల కోసం మాట్లాడుతున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికే మూతపడిన ఫెర్రో ఎల్లాయిస్, జ్యూట్, చెరకు, స్టీల్ పరిశ్రమలను తెరిపించాలని డిమాండ్ చేశారు. 32 మంది బలిదానాలతో ఏర్పాటైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ముక్కలు చేసి విక్రయించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నప్పటికీ బాబు, పవన్ మాట్లాడటం లేదని మండిపడ్డారు. సిఐటియు ఆధ్వర్యాన మొక్కవోని దీక్షతో అడ్డుకోవడం వల్ల ఇప్పటి వరకు మోడీ పాచిక పారలేదన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకరావు, కె.సురేష్ మాట్లాడుతూ మహాసభలో అన్ని రంగాలకు చెందిన కార్మికుల సమస్యలపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

పని భారం పెంచేందుకు ప్రయత్నం

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

పనిగంటలను పెంచేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సిద్ధమౌతోందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ విమర్శించారు. ఈ విషయంలో వైసిపి కూడా నోరుమెదపడం లేదన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఇందులో భాగంగానే కార్మివర్గానికి తీవ్ర నష్టం చేకూర్చే నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చిందని, దీనికి టిడిపి, జనసేనతోపాటు వైసిపి ఎమ్‌పిలు కూడా వంతపాడారని దుయ్యబట్టారు. దీనివల్ల 8గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచేందు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్నిబట్టి మన రాష్ట్రంలోని చంద్రబాబు, పవన్, జగన్ ఎవరి పక్షాన ఉన్నారో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. మహిళలపట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే అంగన్‌వాడీ, ఆయా, మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు తదితర స్కీమ్ వర్కర్లకు రూ.26 వేల కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యుటీ వంటివి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అదునుకు ఎరువులు అందిస్తాం

రైతులు ఆందోళన చెందొద్దు • 'డయల్ యువర్ కలెక్టర్'లో కలెక్టర్ అంబేద్కర్



'డయల్ యువర్ కలెక్టర్'లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఎరువులకు కొరత లేదని, అవసరమైన ప్రాంతాలకు సమయానికి సరఫరా చేస్తామని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పష్టంచేశారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆదివారం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో 30 మంది రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. 25 మంది మంది రైతులు రెండో విడత ఎరువులు అందడం లేదని ప్రస్తావించారు. కలెక్టర్ స్పందిస్తూ రెండో విడత యూరియా వేయడానికి ఇంకా సమయం ఉందన్నారు. శాస్త్రవేత్తల సూచన మేరకు పంట వేసిన 35-40 రోజుల తరువాత మాత్రమే రెండో విడత ఎరువులు వేయాలని సూచించారు. ఆ సమయానికి యూరియా అందజేస్తామని, రైతులు ముందుగానే కొనేందుకు రావాల్సిన అవసరం లేదని చెప్పారు. ఎకరాకు మూడు దఫాలుగా 25 కిలోల చొప్పున మాత్రమే యూరియా వాడాలని రైతులకు సూచించారు. 10 రోజుల్లో రెండో విడత ఎరువులు సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. కొన్ని మండలాల్లో ముందుగా 30 శాతం నాట్లు పడిన రైతులకు, నిర్ణీత సమయంలోనే రెండో విడత ఎరువులు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. గరవిడి మండలం వెదుల్లవలస రైతుతో కలెక్టర్ మాట్లాడుతూ 12 మెట్రిక్ టన్నుల ఎరువు పంపించామని తెలిపారు. వంగర మండలం యువిఆర్ పేట రైతుతో మాట్లాడుతూ 20 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని, సోమవారం ఎంఎఒను పంపిస్తామని చెప్పారు. ప్రయివేటుగా అధిక రేట్లకు ఎరువులు అమ్ముతున్నారని వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ స్పందిస్తూ విజిలెన్స్, పోలీస్ అధికారులతో ముమ్మర తనిఖీలు చేపట్టి, అధిక ధరలను అరికడతామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు 411 తనిఖీలు నిర్వహించి, ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.40 లక్షలు విలువైన 172 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు, మార్క్‌ఫెడ్ డిఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మరో వారం పాటు డివైసి

కలెక్టర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని మరో వారం పాటు కొనసాగించాలని కలెక్టర్ నిర్ణయించారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు 9441957315 నంబరుకు రైతులు ఫోన్ చేసి, యూరియా సరఫరాలో సమస్యలు, అభిప్రాయాలను తెలియజేయవచ్చని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

కారు బీభత్సం

- మూడు ద్విచక్రవాహనాలను ఢీకొన్న వైనం
- ఇద్దరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జామి మండలం అలమండ, లక్కవరపుకోట మండలం భీమాలి మధ్యలో ఆదివారం సాయంత్రం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. లక్కవరపుకోట మండలం భీమాలి గ్రామానికి చెందిన గుల్లిపల్లి సురేష్ (32), జామి మండలం సిరికిపాలెం గ్రామానికి చెందిన బోని సాగర్ (24)తో పాటు మిడతాన సూర్య ప్రకాశ్ వేర్వేరు ద్విచక్ర వాహనాలపై తమ సొంత గ్రామాలకు వెళ్తున్నారు. కొత్తవలస వైపు నుంచి ఎదురుగా వస్తున్న కారు.. మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొంది. దీంతో బోని సాగర్, గుల్లిపల్లి సురేష్ అక్కడికక్కడే మృతి చెందారు. మిడతాన సూర్యప్రకాశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కారు రోడ్డు పక్కన ఉన్న గోడను ఢీకొంది. కారు ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో కారు డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. సూర్యప్రకాశ్‌ను విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. జామి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం సంభవించిందని స్థానికులు చెబుతున్నారు.



మృతిచెందిన సురేష్, సాగర్

క్విజ్ పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం రోటరీ సెంట్రల్ క్లబ్ నిర్వహిస్తున్న నవతరోత్సవాలలో భాగంగా ఆదివారం నిర్వహించిన క్విజ్ పోటీలకు విశేష స్పందన లభించింది. స్థానిక ప్రయివేటు హోటల్లో నిర్వహించిన క్విజ్ పోటీలకు నగరంలోని 18 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి విశేషాలను ఉటంకిస్తూ వివిధ రంగాలపై క్విజ్ మాస్టర్ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు తమ ప్రజ్ఞ పాఠవాలతో సమాధానాలు చెప్పారు. రోటరీ సెంట్రల్ క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ అగర్వాల్, కార్యదర్శి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్విజ్ నిర్వహణ కమిటీ చైర్మన్ ఆనంద్ అగర్వాల్, కళ్యాణ్ విశ్వనాథ్, యూత్ సర్వీస్ డైరెక్టర్ రోహిత్ సంజయ్, చైర్మన్ కృష్ణతేజ, చెన్నా ప్రదీప్ పాల్గొన్నారు.

సిఎం ఏమి నెరవేర్చారు?

ఉపాధ్యాయుల బాధ్యతలను

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి మోహనరావు




సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి మోహనరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో.. విద్యార్థుల బాధ్యత మీది, ఉపాధ్యాయుల బాధ్యత తనదన్న ముఖ్యమంత్రి 15 నెలల పాలనలో టీచర్లకు ఏమి చేశారో చెప్పాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు డిమాండ్ చేశారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక జెడ్‌పి మినిస్టీరియల్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగం ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సింది పోయి, 50 శాతం ప్రయివేటు చేతిలోకి వెళ్లిందని, ప్రభుత్వ విధానాలే అందుకు కారణమని చెప్పారు. గత ప్రభుత్వం విద్యా రంగాన్ని ఆరు రకాలుగా విభజిస్తే, కూటమి ప్రభుత్వం 9 రకాలుగా మార్చిందన్నారు. రాష్ట్రంలో 38 శాతం ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేసి, సింగిల్ టీచర్ స్కూళ్లను మూసేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. మెగా డిఎస్‌సి అంతా గందరగోళంగా ఉందన్నారు. యాప్‌లు రద్దు చేస్తామని చెప్పి, అన్ని యాప్‌ల పనులన్నీ ఒకే యాప్‌లో పెట్టి అమలు చేస్తున్నారన్నారు. యాప్‌లో కేవలం కాగితపు లెక్కలు తప్ప విద్యకు సంబంధించిన విషయాలు ఏవీ లేవన్నారు. యోగా పేరుతో నెల రోజులు, మెగా పేరెంట్స్ డే పేరుతో చదువు చెప్పనీయకుండా పనులు అప్పగిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం, కాపాడుకోవడం కోసం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు కార్యాచరణ రూపొందించాలని పిలుపిచ్చారు. అనంతరం కార్యదర్శి నివేదికను జిల్లా ప్రధాన కార్యదర్శి జెవిఆర్‌కె ఈశ్వరరావు ప్రవేశపెట్టారు. సమావేశంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు డి.రాము, కె.విజయగౌరి, జిల్లా గౌరవ అధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, కార్యవర్గ సభ్యులు పార్వతి, భాస్కరరావు, సత్యశ్రీనివాస్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమేష్‌చంద్ర పట్నాయక్ పాల్గొన్నారు.

శాశ్వత లోక్అదాలత్‌తో సత్వర న్యాయం

- అప్పీల్‌కు అవకాశం లేదు
- 3 నెలల వ్యవధిలోనే శాశ్వత పరిష్కారం
- ప్రజల్లో అవగాహన పెరగాలి
- 'ప్రజాశక్తి'తో శాశ్వత లోక్అదాలత్ చైర్మన్ జి.దుర్గయ్య ముఖాముఖి



ప్రజాశక్తి-విజయనగరంకోట


'అప్పీల్‌కు అవకాశం లేని తీర్పులు వెలువరించేదే పర్మినెంట్ లోక్అదాలత్. దీని ద్వారా మూడు నెలల వ్యవధిలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఇప్పటి వరకు జిల్లాలో 250కు పైగా కేసులను పరిష్కరించాం. పర్మినెట్ లోక్ అదాలత్‌పై ప్రజల్లో అవగాహన పెరగాల్సి ఉంది' అని పర్మినెంట్ లోక్ అదాలత్ జి.దుర్గయ్య వెల్లడించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

పర్మినెంట్ లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశం ఏమిటి.?

అప్పీల్‌కు అవకాశం లేని సత్వర న్యాయం అందించే శాశ్వత తీర్పులు వెలువరించేదే పర్మినెంట్ లోక్‌అదాలత్. జిల్లా కోర్టులు, అదాలత్‌పై భారాన్ని తగ్గించేందుకు ఈ శాశ్వత అదాలత్‌ను ఏర్పాటు చేశారు. తగాదాలను సాగ తీయడానికి అవకాశం ఉండదు. కక్ష సాధింపు చర్యలకు అవకాశం ఉండదు .రాజీ ద్వారా లేదా తుది తీర్పు ద్వారా కేసులను మూడు నెలల్లోపు పరిష్కరిస్తాం.

పర్మినెంట్ లోక్ అదాలత్‌లో ఎలాంటి కేసులు పరిష్కరిస్తారు.?

ఈ అదాలత్‌లో ప్రధానంగా పది రకాలైన కేసులకు పరిష్కరించే ఆస్కారం ఉంది. బీమా సేవలు (మోటార్ వెహికల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కేసులు మినహాయించి), బ్యాంకింగ్ ఆర్థిక సంస్థ సేవలు, విద్యా లేక విద్యాసంస్థలకు సంబంధించిన తగాదాలు, రియల్ ఎస్టేట్ ఆస్తికి సంబంధించిన సేవలు, ఉపాధి హామీ, రోడ్ ట్రాన్స్‌పోర్టు, వాయు రవాణా, జల రవాణా సేవలు, పోస్టల్, టెలిఫోన్, టెలిగ్రామ్ సేవలు, ప్రజలకు అందించే విద్యుత్ సరఫరా, నీటి సరఫరా సేవలు, ప్రజా సంరక్షణ వ్యవస్థ, పారిశుధ్య సేవలు, ఆస్పత్రి లేక నర్సింగ్ హోం సేవలు ఇందులో ఉన్నాయి.



పర్మినెంట్ లోక్ అదాలత్ ప్రాదేశిక పరిధి.?

ఉమ్మడి విజయనగరం జిల్లాలో వచ్చే కేసులను పరిష్కరించి శాశ్వత రాజీ మార్గం లేదా శాశ్వత తీర్పులు ఇవ్వబడతాయి. ఇందులో అప్పీల్‌కు అవకాశం లేదు.

పర్మినెంట్ లోక్ అదాలత్‌లో వచ్చే కేసులకు రుసుం ఏ విధంగా ఉంటుంది.?

ఇందులో వచ్చే కేసులకు కోర్టు రుసుం (ఫీజు) చెల్లించకుండానే పైన పేర్కొన్న కేసులు దాఖలు చేయొచ్చు. ఉచితంగా పైన తగాదాలకు తుది పరిష్కారం లభిస్తుంది.

పర్మినెంట్ లోక్ అదాలత్‌లో ద్రవ్య అధికార పరిధి(పరిహారం) ఎంతవరకు ఉంటుంది.?

వచ్చే కేసులను బట్టి పరిహారం ఉంటుంది. ఇందులో రూ.కోటి వరకు పరిధి ఉంది.

పర్మినెంట్ లోక్ అదాలత్ ఇచ్చిన తీర్పుల తర్వాత ఏ కోర్టులకైనా వెళ్లొచ్చా.?

జిల్లా స్థాయి కోర్టుల్లో ఇచ్చే తీర్పులు ఒక జడ్జి వెలువరిస్తారు. అలా కాకుండా పర్మినెంట్ లోక్ అదాలత్‌లో జడ్జితోపాటు కమిటీ లేదా బెంచ్ సభ్యులు ముగ్గురు ఇచ్చిన తీర్పే తుది తీర్పు. దీని తరువాత ఎటువంటి కోర్టులకు వెళ్లడానికి ఆస్కారం లేదు.

తీర్పుకు ఎంత కాలవ్యవధి పడుతుంది.?

పర్మినెంట్ లోక్ అదాలత్‌కు వచ్చిన కేసులు ఒకసారి నమోదైతే మూడు నెలలు అనగా 90 రోజుల్లోపే తుదితీర్పులు వెలువడి శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఇదే తుది తీర్పు.

పర్మినెంట్ లోక్ అదాలత్ జిల్లాలో ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది.? ఇప్పటివరకు ఎన్ని కేసులు పరిష్కరించారు.?

జిల్లాలో 2023వ సంవత్సరంలో పర్మినెంట్ లోక్ అదాలత్ ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 250 కేసుల పైబడి శాశ్వత పరిష్కారం చూపించి, తీర్పులు ఇచ్చాం. దీనినే మరొక విధంగా స్నేహపూర్వక కోర్టులు అని కూడా పిలుస్తారు.

బ్యాంకు సేవలపై అవగాహన ర్యాలీ

మెంటాడ: సెంట్రల్ బ్యాంకు సేవలపై ఆదివారం ఉదయం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సెంట్రల్ బ్యాంకు ఏజిఎం ఆరసాడ శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ చల్లపేట సెంట్రల్ బ్యాంకు బ్రాంచిలో డిపాజిట్లు చేస్తే మిగతా బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇస్తామన్నారు. ఈ బ్యాంకులో రైతులకే కాక మిగతా ఖాతాదారులకు అనేక రకాల రుణాలను అతి తక్కువ వడ్డీతో ఇస్తున్నామన్నారు. మండల ప్రజలకు సెంట్రల్ బ్యాంకు విశిష్టతను, బ్యాంకు సేవలు పనితీరుపై బైక్ ర్యాలీ చేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చల్లపేట బ్రాంచి మేనేజర్ పాండ్రంకి శ్రీనివాసరావు, మెంటాడ పిఎసిఎస్ సిఇఒ వెంపడాపు ప్రసాదరావు, సూపర్‌వైజర్ నారాయణరావు, పిఎసిఎస్ సిబ్బంది పతివాడ విశ్వేశ్వరరావు, ఆరసాడ విజయ్‌కుమార్, పి.చిరంజీవి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మంచి సమాజాన్ని నిర్మించడంలో కీలకపాత్ర

బొబ్బిలి: మంచి సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. స్థానిక కోటలో ఆదివారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బోధించి విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ రౌతు రామమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షపు నీటితో నిలిచిన వాహనాలు

లక్కవరపుకోట: మండల కేంద్రంలో విశాఖ అరకు మధ్యలో అంబేద్కర్ కూడలి వద్ద వర్షం బీభత్సం సృష్టించడంతో వాహనాలు స్తంభించాయి. రోడ్డుపైకి వర్షపు నీరు చేరడం వల్ల చాలాసేపు వాహనాలు నిలిపివేశారు. వర్షపు నీరు ఎక్కువగా నిల్వ ఉండటంతో రహదారి పూర్తిగా మూసుకుపోయింది. వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఈ పరిస్థితులు ఎదుర్కొంటున్నామని అక్కడ ఉన్న దుకాణదారులు స్థానికులు తెలిపారు. అదే దారిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సి ఉండటంతో నీటి గుండా ప్రయాణించడానికి ఇబ్బందులు పడ్డారు. నిల్వ ఉన్న నీరు మళ్లింపడానికి దారి లేకపోవడంతో చాలా కాలం అక్కడే నీరు ఉండిపోతుందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు

రాజాం: గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సిఐ ఆర్. జైభీమ్ హెచ్చరించారు. ఆదివారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై ఆయన ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి 55 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ముగ్గురు పై కేసులు నమోదు చేశామన్నారు. ఈ ఏడాది జనవరి నుండి నేటి వరకు 119 మందిపై కేసులు నమోదు చేసి 911 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

డ్రోన్‌తో కషాయాల పిచికారీ రైతుకు లాభం

శృంగవరపుకోట: డ్రోన్‌తో కషాయాల పిచికారీ రైతుకు లాభదాయకమని రీజనల్ టెక్నికల్ లీడ్ ప్రకాష్ అన్నారు. మండలంలోని సంత గైరమ్మపేట, వినాయకపల్లి గ్రామాల్లో ఆదివారం డ్రోన్‌తో కషాయాలు పిచికారి చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ రైతులందరూ ఆధునిక పరిజ్ఞానం వైపు మారాలని వ్యవసాయంలో యాంత్రికరణ వల్ల రైతుకు లాభదాయకం అని తెలియజేశారు. రైతులందరూ వినాయకపల్లి, సంత గౌరమ్మ పేట గ్రామాలలో పలు పత్ర ద్రావణం డ్రోన్‌తో పిచికారి చేస్తున్నామన్నారు. మాస్టర్ ట్రైనర్ పి.కోటి బాబు, ఈశ్వర రావు, యూనిట్ ఇంచార్జ్ కృష్ణ, చరణ్ ఐసిఆర్‌పి రామలక్ష్మి, మెంటర్, ఫార్మర్ సైంటిస్ట్ రైతులు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

నెల్లిమర్ల: కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ అన్నారు. ఆదివారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు కనకల పద్మనాభం ఆధ్వర్యంలో జరిగిన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పాలనలో దేశాభివృద్ధి కుంటుపడి మత కలహాలు, అవినీతి బంధుకోణాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా బిజెపి కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలు, ఎన్నికల కమిషన్ చేతిలో పెట్టుకొని బ్లాక్ మెయిల్ రాజకీయం చేసి పబ్బం గడుపుకుంటుందన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎస్. శ్రీను, నాయకులు ఎస్. రమేష్ కుమార్, సూరిబాబు, కనకల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి పేదలకు వరం

వేపాడ: సిఎం సహాయ నిధి పేదలకు వరం అని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మండలంలోని బానాది సచివాలయం పరిధిలో గల ఎం. సింగవరం గ్రామానికి చెందిన కోళ్ళ రూపా దేవికి ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం సిఎం సహాయనిధి చెక్కు రూ.1.75 లక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, టిడిపి మండల ఉపాధ్యక్షుడు పోతల, ఎం.సింగవరం గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే, గొంప వెంకటరావు

'మా ఊరి చెరువును కాపాడండి'

నెల్లిమర్ల: 'జిల్లా కలెక్టర్ గారు మా ఊరి చెరువును కాపాడండి బాబు' అంటూ మండలంలోని తంగుడుబిల్లి గ్రామస్తులు కోరారు. ఆదివారం తంగుడుబిల్లి చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతీ కృష్ణమూర్తి నాయుడు, గౌరవ అధ్యక్షులు భారతానంద స్వామీజీ, రాష్ట్ర అధ్యక్షులు జగారపు ఈశ్వర ప్రసాద్ గ్రామస్తుల పిలుపుమేరకు ఆ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ గ్రామంలోని చెరువును కొంతమంది కబ్జా చేస్తున్నారంటూ ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి నీటి ఆధారమైన సర్వే నెంబరు 72-1లోని 2.40 ఎకరాల చెరువును కొంతమంది కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తంగుడుబిల్లి గ్రామానికి బావుల్లో, బోర్లులో నీళ్లు ఉండాలంటే గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువులో నీరు ఉంటేనే ఉంటున్నాయన్నారు. చెరువు ఏ కారణం చేతైనా ఎండిపోతే బావుల్లోను, బోర్లులో చుక్క నీరు కూడా ఉండటం లేదన్నారు. అటువంటిది చెరువును పూర్తిగా కప్పేసి కబ్జాకు పాల్పడితే గ్రామ ఉనికే ప్రమాదంలో పడుతుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ ఈ నీటి వనరులను కాపాడాల్సిన అధికారులు కబ్జాదారులకు సహకరించడం తీవ్ర నేరం అన్నారు. తక్షణమే అటువంటి అధికారులను సస్పెండ్ చేయాలన్నారు.

టెన్నికాయిట్ పోటీలు ప్రారంభం

విజయనగరం టౌన్: రాజీవ్ స్టేడియంలో టెన్నికాయిట్ ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ జట్ల ఎంపిక కొరకు సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు అధికారి ఎ.రామారావు ప్రారంభించారు. సీనియర్ జట్టు ఈ నెల 13, 14 తేదీల్లో మండపేటలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి రామారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

విజయనగరం టౌన్: విజయనగరం జిల్లా చెస్ అసోసియేషన్ కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా కె.ఆర్.జగన్నాథ్, ఉపాధ్యక్షులుగా సాగి జానకిరామ్ రాజు, డాక్టర్ పైల రమేష్ కుమార్, కార్యదర్శిగా కరణం భాస్కరరావు, జాయింట్ కార్యదర్శులుగా కళ్ల లీలా ప్రసాదరావు, శంబాన శ్రీధర్, కోశాధికారిగా బైరెడ్డి సన్యాసినాయుడు ఎన్నికయ్యారు. దీనికి రిటర్నింగ్ ఆఫీసర్‌గా ఎం.పీటర్ మార్టిన్ వ్యవహరించారు.

యువకుడు ఆత్మహత్య

కంటోన్మెంట్: విజయనగరం కనపాకకు చెందిన బి.భూషణం (29) పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. కనపాకలో నివాసం ఉంటున్న భూషణం ఉద్యోగం కోసం అనేక పోటీ పరీక్షలు రాసినప్పటికి ఉద్యోగం రాలేదు. కార్ డ్రైవర్‌గా కిరాయికి ఆప్షనల్ డ్రైవర్‌గా వెళ్లే వాడు. ఎంత చదివినప్పటికీ ఉద్యోగం రాలేదని ఈనెల 6న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని తమ్ముడు కమలేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సిఐ ఆర్‌వికెఆర్ చౌదరి తెలిపారు.

మొరాయించిన కంప్యూటర్లు

◆ప్రింటర్ లేక సర్వీసులకు ఇబ్బందులు ◆పిడిఎఫ్‌తో నెట్ సెంటర్‌లకు పరుగులు ◆అవస్థలు పడుతున్న సచివాలయు ఉద్యోగులు, ప్రజలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి గ్రామ సచివాలయ పరిధిలో సంకిలి, అప్పాపురం గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల్లో బొడ్డవలస, చిన్నయ్యపేట, మజ్జి రాముడు పేటతోపాటు మరో మూడు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 10వేల మంది జనాభా ఉన్నారు. వీరికి ప్రభుత్వ సర్వీసులు నిమిత్తం సచివాలయం ఏర్పాటు చేసినప్పటికీ సచివాలయంలో కంప్యూటర్లు, ప్రింటర్ మొరాయించడంతో ప్రభుత్వ సర్వీసులు ప్రజలకు అందించేందుకు సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. గత ఏడాది నుంచి ఇదే పరిస్థితి నెలకొన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. డిజిటల్ అసిస్టెంట్, సోషల్ వెల్ఫేర్, వ్యవసాయ అసిస్టెంట్‌తో పాటు ఇతర సిబ్బంది తంటాలు పడి ఇంటి వద్దనో, మొబైల్ లోనో ప్రజలకు వివిధ రకాల సర్వీసులు ఇస్తున్నారు. ప్రతి సర్వీసుకు ప్రభుత్వ నిబంధనల మేరకు నగదు చెల్లిస్తున్నారు. ప్రింటర్ మోరాయించటంతో అర్జీదారులకు కనీసం రసీదు ఇచ్చే పరిస్థితి కూడా కనిపించలేదు. ఆయా సర్వీసులు సంబంధించి వివిధ శాఖ అధికారులు జారీచేసిన ధృపత్రాలు పంపిణీకి కనీసం ప్రింటింగ్ ఇచ్చే పరిస్థితి కూడా లేదు. విద్యార్థులకైతే మొబైల్ ద్వారా పిడిఎఫ్ పెట్టి చేతి చమురు వదిలించుకొని నెట్ సెంటర్లో ప్రింట్ తీసుకునే పరిస్థితి దాపరించింది. మొబైల్ లేని వారు, నిరక్షరాస్యులు పరిస్థితి



సంకిలి సచివాలయంలో మొరాయించిన కంప్యూటర్లు

మరింత దయనీయగా ఉంది. ఇలా ఏడాది నుంచి కంప్యూటర్లు, ప్రింటర్ మొరాయించినా అధికారులు, పంచాయతీ పాలకవర్గం పట్టించుకునే దాఖలాలు కనిపించలేదు. వాస్తవంగా సచివాలయ సిబ్బంది 1,032 సర్వీసులు ప్రజలకు అందించవలసి ఉంది. కంప్యూటర్లు, ప్రింటర్ లేకపోవడంతో అర్జీ దారుని వద్ద దరఖాస్తులు స్వీకరించి ఇంటి వద్ద, ప్రైవేట్ సెక్టార్‌లలో ఉన్న కంప్యూటర్లతో సర్వీసు ఇవ్వవలసి వస్తుంది. సచివాలయం ఉద్యోగులు మొబైల్ ద్వారా సర్వీసులు ఇద్దామనుకున్నా నెట్వర్క్ సమస్యతో ఆ పనులు కూడా కావడం లేదు. దీంతో అర్జీదారులకు సమయాలకు ధ్రువపత్రాలు అందించలేక ఉద్యోగ సిబ్బందితోపాటు అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేషనరి కూడా లేక ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. శనివారం అర్జీదారుడుకు తహశీల్దార్ కార్యాలయం నుంచి కుల, ఆదాయ సర్టిఫికేట్ మీ సచివాలయానికి వెళ్లి తీసుకోండి అని మెసేజ్ వచ్చిన అనంతరం అర్జీదారుడు వెళ్లినా కంప్యూటర్లు, ప్రింటర్ పనిచేయకపోవడంతో ఏమి చేయలేని పరిస్థితిలో సిబ్బంది తెల్లమొహం వేశారు. అర్జీదారుడు ధ్రువపత్రాల కోసం నానా తంటాలు పడ్డారు. ధ్రుపత్రాలు అత్యవసరం కావడంతో తన స్నేహితుడు మొబైల్‌కు పిడిఎఫ్ పెడితే పాలకొండ, ఉంగరాడ మెట్ట ఇతర గ్రామాలలో ఉన్న నెట్ సెంటర్లుకు వెళ్లి తీసుకోవలసిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పంచాయతీ పాలకవర్గం స్పందించి సంకిలి సచివాలయానికి నూతన కంప్యూటర్లు, ప్రింటర్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ పరిధిలో ఉన్న ప్రజలు కోరుతున్నారు.

గ్రామపంచాయతీ నిధుల నుంచి కొనుగోలు

గ్రామ సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్ మొరాయించినా గ్రామ పంచాయతీల నిధుల నుంచి కొనుగోలు చేయవచ్చు. ప్రభుత్వ సర్వీసుల కోసం అర్జీదారుడు రసీదులు నిమిత్తం స్టేషనరీ కూడా పంచాయతీ నిధుల్లో తీసుకోవచ్చు. ఇటీవల లింగాలవలస ఇతర సచివాలయాల్లో ఇలాగే జరిగితే కొనుగోలు చేసుకున్నారు. తప్పనిసరిగా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కొనుగోలు చేయాలి.

శ్యామల కుమారి, ఎంపిడిఒ, రేగిడ

జాతీయ ఉత్తమ ప్రిన్సిపల్‌గా జయప్రసాద్

ప్రజాశక్తి - గరివిడి



బొబ్బిలి గోకుల్ గ్రూఫ్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ వీర్ల జాషువా జయ ప్రసాద్ జాతీయస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపికయ్యారు. నీతి అయోగ్ గుర్తింపు పొందిన కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్స్ ఇండియా ఈ అవార్డును హైదరాబాదులో ఇటీవల ప్రదానం చేసింది. జాతీయ స్థాయిలో 52 మందిని మాత్రమే ఎంపిక చేసి ప్రశంస పత్రాలతో సన్మానించారు. ఈ ఎంపికలో మొత్తం సర్వీసును, టీచింగ్, రీసెర్చ్ ఇన్నోవేటివ్ ప్రాక్టీస్‌లో వారు చేసినటు వంటి విశేషమైన కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు బహుకరించినట్టుగా తెలియజేశారు. గరివిడికి చెందిన ఈయనకు హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో జెఎన్టియు జీవి ఇంచార్జ్ విసి, డాక్టర్ డి.రాజలక్ష్మి, సి -డాక్ సైంటిస్ట్-ఎఫ్ ఎం కుమార్, డేటా వ్యాలీ సిఇఒ పవన్ చేతులు మీదుగా అవార్డు అందించారు. ఈ సందర్భంగా గోకుల్ కళాశాల ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది, యాజమాన్యం జయప్రసాద్‌ను అభినందిచారు.

యూరియా కోసం బారులు

ప్రజాశక్తి - చీపురుపల్లి

చీపురుపల్లిలో గత రెండు రోజుల నుండి యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. యూరియా కోసం వానలో సైతం తడుస్తూ రైతులు వేచి చూస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తాము ఇబ్బందులు పడుతున్నామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజులు తడబడి కాళ్లరిగేలా తిరుగుతున్నా తమ గోడు అటు పాలకులకు గానీ ఇటు అధికారులకు గానీ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. సరైన సమయంలో ఎరువులు దొరక్క అష్టకష్టాలు పడుతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు దుకాణాలకు కొంత, సొసైటీలకు మరికొంత ఇవ్వడంతో అసలు యూరియా ఎటు వెళ్లిపోతుందో తెలియడం లేదని ఆవేదన చెందుతున్నారు.

తాజాగా చీపురుపల్లిలో గల ఒక ప్రైవేటు షాపునకు 24 టన్నులు, పెదనడిపల్లి సొసైటీకి 12 టన్నులు యూరియా వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ రైతులకు మాత్రం యూరియా ఇచ్చేందుకు ముందుకు రావడం లేదంటూ రైతులు ఆరోపిస్తున్నారు. ఆదివారం చీపురుపల్లి పట్టణంలోగల ఒక షాపులో ఉన్న యూరియాని ఇచ్చేందుకు అధికారులు ఏర్పాటు

రోండు రోజులుగా ఇదే తంతు



ఎరువులు కోసం గొడవ పడుతున్న రైతులు

చేసినప్పటికీ రైతులు ఒక్కసారిగా రావడంతో రైతుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో పోలీసులు జోక్యం చేసుకొని రైతులను క్యూలో నిలబెట్టి యూరియాని ఒకొక్కరికి ఒక్క బస్తా ఇచ్చారు. అయితే కొంత సమయం అయిన తరువాత యూరియా అయిపోయిందని సంబంధిత షాపు వారు చెప్పడంతో చేసేది లేక రైతులు వెనుదిరిగారు. పెదనడిపల్లి సొసైటీకి వచ్చిన యూరియాను పంపిణీ చేయకుండా ఎందుకు ఉంచారని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

లబ్ధిదారులకు 'స్మార్ట్' కష్టాలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులు సకాలంలో అందక లబ్ధిదారులు కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను సరఫరా చేసినప్పటికీ అధికారులు లబ్ధిదారులకు సకాలంలో అందించే చర్యలు చేపట్టలేదు. దీంతో స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల లబ్ధి పొందాల్సిన వారు ఆందోళనకు గురవుతున్నారు.



స్మార్ట్ కార్డులు కోసం వచ్చిన లబ్ధిదారులు

మండల కేంద్రంలోని 2 చౌక ధరల దుకాణాలు ఉన్నాయి. ఈ రెండు దుకాణాల పరిధిలో సుమారు 1400 స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం డీలర్లు చేతుల మీదుగా ఈ నెల ఒకటి నుంచి 15 వరకూ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఈ రెండు దుకాణాలకు సంబంధించి ఒక దుకాణం డీలర్ సక్రమంగా ఆయన పరిధిలో ఉన్న స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసినప్పటికీ రెండవ డిపో పరిధి బినామీ డీలర్ గణేష్ మాత్రం స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. దీంతో డీలర్‌ను లబ్ధిదారులు ప్రశ్నించగా పొంతన లేని మాటలు చెబుతూ బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తున్నాడని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని సకాలంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇప్పించి తమకు రేషన్ ఇప్పించాలని కార్డుదారులు కోరుతున్నారు.

'అన్నదాత పోరు'లో పాల్గొనండి : వైసిపి

ప్రజాశక్తి - గజపతినగరం

వైసిపి రైతు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 9న చేపట్టనున్న 'అన్నదాత పోరు'లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు అన్నారు. ఆయన మండల కేంద్రంలో ఆదివారం 'అన్నదాత పోరు' పోస్టర్లను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం అన్నదాతలకు ఎరువులు సకాలంలో సరఫరా చేయలేక ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆర్‌డిఒ కార్యాలయాలు వద్ద నిర్వహించనున్న "అన్నదాత పోరు" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తౌడు, గంట్యాడ మండల నాయకులు వర్రీ నరసింహమూర్తి, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ కరణం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: ఈ నెల 9వ తేదీన జరగబోయే 'అన్నదాత పోరు' పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతు యూరియా బ్లాక్ దందాతో పాటు, రైతుల సమస్యల విషయంలో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్న కూటమి ప్రభుత్వంపై నిరసనగా వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌డిఒ కార్యాలయాల ఎదుట అన్నదాత పోరు అనే ఆందోళన కార్యక్రమం చేపడతామని ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అద్యక్షులు ఒబ్బిన నాయుడు, గొర్లె రవికుమార్, గుమ్మడి సత్యన్నారాయణ, మమ్ములూరి జగన్నాథం, ఎంపిపిలు గేదెల శ్రీనివాసరావు, దొగ్గ సత్యవంతుడు, మాజీ ఎంపిపి గొరపల్లి శివ, వైస్ ఎంపిపిలు పినిశెట్టి వెంకటరమణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: రైతన్నకు బాసటగా వైసిపి ఏర్పాటు చేసిన ఎరువుల బ్లాక్ మార్కెట్ పై అన్నదాత పోరు కార్యక్రమం సెప్టెంబర్ 9వ తారీఖున బొబ్బిలి, గజపతినగరం నాయకులు కలసి చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు తెలిపారు. ఆరోజు ఉదయం బొబ్బిలి ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ర్యాలీ చేపట్టి ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తామ న్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



బొబ్బిలి: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

చీపురుపల్లి: ఈ నెల 9న తలపెట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అన్నదాత పోరుకి సంబంధించిన గోడ పత్రికలను వారు ఆదివారం వైసిపి కార్యాలయంలో విడుదల చేశారు. చేసారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కరిమజ్జి శ్రీనివాసరావు, పతివాడ రాజారావు, కోరాడ పృధ్వి, గవిడి సురేష్, యల్ ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర ఫలాలు అందించాలి


ప్రజాశక్తి- శృంగవరపుకోట

79 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో భూములు కోల్పోయిన దళిత గిరిజన జిందాల్ నిర్వాసిత రైతులకు స్వతంత్ర ఫలాలు అందడం లేదని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం బోడ్డవరలో జాతీయ జెండాలతో జిందాల్ నిర్వాసితులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటంలో ఉన్న జిందాల్ నిర్వాసితులను ' మీరు దరఖాస్తులు ఇవ్వండి మీ సమస్య వెంటనే పరిష్కరిస్తామని ప్రకటించిన కలెక్టర్ తీరా దరఖాస్తు ఇచ్చిన మరుసటిరోజే రెవెన్యూ సిబ్బంది రాతపూర్వకంగా ఇచ్చిన ఆ దరఖాస్తులను అర్థాలే మార్చేసారని అన్నారు. ఇప్పటికైనా భూ నిర్వాసితులకు భూమి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దళితులు, బిసిల మధ్య వివాదం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని సతివాడలో గణేష్ నిమజ్జనంలో దళితులు, బిసిల మధ్య వివాదం చోటు చేసుకుంది. శనివారం రాత్రి ఎస్‌సి కాలనీ వాసులు గణేష్ విగ్రహాన్ని ఊరేగింపులో భాగంగా బిసి కాలనీ మీదగా వెళ్తుండగా బిసి గ్రూపునకు చెందిన వారు ట్రాక్టర్ అడ్డు పెట్టినట్లు దళిత వర్గాలు ఆరోపించాయి. దళిత యువకులు బిసిలకు చెందిన ఆడ పిల్లలను ట్రాప్ చేస్తున్నారని, బిసి యువకులు దళిత మహిళలను వేధింపులకు పాల్పడుతున్నారని పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. కాగా ఇటీవల బిసి అమ్మాయిని, దళిత అబ్బాయి కులాంతర వివాహం చేసుకోవడం తో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగి వినాయక నిమజ్జనంలో బయట పడినట్లు తెలిస్తోంది. దీంతో ఇరు వర్గాల మధ్య వివాదం చెలరేగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి గణేష్ నిమజ్జనం జరిపించారు. గ్రామంలో ఉద్రిక్తలు కలగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. కాగా దళితులపై బిసి వర్గాలు వివక్ష చూపించి గణేష్ నిమజ్జనం అడ్డుకుంటున్నారని అంబేద్కర్ ఇండియా మిషన్ నాయకులు బి వి రమణ ఆరోపించి దళిత వాడలో నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆ గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసు పికెట్ నిర్వహిస్తున్నారు.



గ్రామంలో పికెటింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

శృంగవరపుకోట: లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సబ్జెక్ట్‌కి ఒక స్కూల్ అసిస్టెంట్, మండలానికి ఒక సెకండరీ గ్రేడ్ టీచర్‌లను ఎంపిక చేసి ఆదివారం వారిని ఘనంగా సత్కరించారు. స్థానిక ఆర్‌కె గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన 'ఉత్తమ ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమం'లో డిఇఒ యు. మాణిక్యం నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలకు గౌరవం ఇవ్వడం ద్వారా సమాజానికి మంచి సందేశం ఇచ్చినట్లేనని, విద్యార్థుల అభివృద్ధిలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని తెలిపారు. నియోజక వర్గ స్థాయిలో ప్రతి సబ్జెక్టుకు ఒక ఉత్తమ ఉపాధ్యాయుని ఎంపిక చేసి సన్మానించడం ద్వారా లక్ష్య ఫౌండేషన్ మంచి ఆదర్శాన్ని నిలబెట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ కె.వెంకట రమణ, రిటైర్డ్ డైట్ ప్రిన్సిపాల్ ఎన్.టి. నాయుడు, డిసిఇబి సెక్రటరీ టి.సన్యాసిరాజు, కర్రీ పవిత్ర లహరి తదితరులు పాల్గొన్నారు.

పిఆర్‌సి ప్రకటించాలి : ఎమ్మెల్సీ

విజయనగరం టౌన్ : ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇవ్వాల్సిన డిఎ, పిఆర్‌సి ఇప్పటికే ఆలస్యమైందని, వెంటనే ఐఆర్ ఇచ్చి, పిఆర్‌సి ప్రకటించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం విజయనగరంలో ఒక ప్రయివేట్ పాఠశాలలో నిర్వహించిన పిఆర్‌టియు జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు పని ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారని, యాప్‌ల పని లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో సంఘంనాయకులు వి.రవీంద్ర నాయుడు, డి.శ్రీనివాసరావు, రావాడ రాంబాబు, ఎ.రాంబాబు, బంకపల్లి శివప్రసాద్, రామకృష్ణ, తిరుపతి నాయుడు, శంకర్ నాయుడు పాల్గొన్నారు.

పుస్తకాలను నేస్తాలుగా మార్చుకోవాలి

ప్రజాశక్తి- విజయనగరంకోట

పుస్తకాలను నేస్తాలుగా మలుచుకోవాలని రోటరీ క్లబ్ పూర్వ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పుస్తకంతో నడక అనే కార్యక్రమాన్ని విజయనగరం రీడ్స్ విద్యలనగరి చిల్డ్రన్స్ బుక్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు రేపల్లె ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. గురజాడ నివాసంలో విగ్రహానికి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అక్కడి నుంచి ఎంఆర్ కళాశాల సెంటర్‌లోని గురజాడ విగ్రహం వరకు పుస్తకాలు పట్టుకుని నడిచి వెళ్లారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కాపుగంటి శ్రీనివాసరావు, గురజాడ సమాఖ్య ప్రతినిధి గురజాడ ఇందిర, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జివి శ్రీనివాసరావు, పెదమంచి ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీహరిబాబు, జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఉపాధ్యక్షులు దయానంద్ పాల్గొన్నారు.

3 పాఠశాలలకు ఉపకరణాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని మూడు పాఠశాలలకు ఐడిబిఐ బ్యాంకు యాజమాన్యం రూ.1.75 లక్షల వ్యయంతో వివిధ ఉపకరణాలను ఆదివారం అందజేసింది. నగరపాలక సంస్థ పాఠశాలల్లో టూబ్‌లైట్లు, ఫ్యాన్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయం కమిషనర్ పల్లి నల్లనయ్య దృష్టికి వచ్చింది. కమిషనర్ అభ్యర్థన మేరకు ఐడిబిఐ బ్యాంకు సిఎస్ఆర్ కార్యక్రమంలో సీలింగ్ ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, మైక్రోస్కోప్‌లను అందజేసింది. కంటోన్మెంట్ పాఠశాలకు రూ.44,750 వ్యయంతో 25 సీలింగ్ ఫ్యాన్లు, 25 ట్యూబ్‌లైట్లు, కస్పా హైస్కూల్‌కు రూ.48,250తో 50 ట్యూబ్‌లైట్లు, 25 సీలింగ్ ఫ్యాన్లు, బిపిఎం హైస్కూల్‌కు రూ.82 వేలతో 25 సీలింగ్ ఫ్యాన్లు, 25 ట్యూబ్ లైట్లు, ఒక ఎలక్ట్రికల్ బైనాక్యులర్ మైక్రోస్కోప్‌ను అందజేశారు.

నానో యూరియాతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - రామభద్రపురం

నానో యూరియా వాడకంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని విహెచ్‌ఎ రేవతి తెలిపారు. మండల పరిధిలోని ఆరికతోటలో నానో యూరియా, డిఎపి వాడకంపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. స్థానిక రామాలయం వద్ద ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ శరత్, జనసేన నాయకులు అల్లు రమేష్, రైతులు పాల్గొన్నారు.

రేగిడి: వ్యవసాయ పంటలకు మోతాదుకు మించి యూరియా వాడితే దిగుబడులు తగ్గిపోతాయని ఎఒ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం బూరాడ, చాటాయి వలస, కొమిరి, లక్ష్మంపురం తదితర గ్రామాల్లో ఎరువుల వాడకంపై రైతులకు గ్రామ సభల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నానో యూరియా వల్ల కలుగు ప్రయోజనాలు తెలిపి వాడే విధానం గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ విజయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొండగుంపాం, మొయిద గ్రామాల్లో యూరియా వినియోగం పై మండల ప్రత్యేకాధికారి జి. మురళి మోహన్, ఎంపిడిఒ కె. రామకృష్ణ రాజు, చీపురుపల్లి ఎడిఎ ఎన్.కోటేశ్వరరావు, ఎఒపి.శ్రీలక్ష్మి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నానో యూరియా పై దృష్టి సారించి ఎరువుల ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. ముఖ్యంగా రైతులు సంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను ఉపయోగించడం ద్వారా ఉత్పాదకత పెంపు, ఖర్చుల తగ్గింపు, నేల సారవంతాన్ని కాపాడుకోవడం వంటి ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ, ఎఇఒలు ఎం నాగరాజ, మహేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు విజయ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

వేపాడ: అన్ని గ్రామాల్లో ఆదివారం ఎరువుల వాడకంపై అవగాహన కల్పించామని ఎఒ ఎం. స్వాతికుమారి తెలిపారు. యూరియా అందరికీ ఇస్తామని ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని ఆయన అన్నారు. మండలంలో 650 టన్నుల యూరియా అవసరమైతే మొదటి విడతగా 260 టన్నులు వచ్చిందని మరో వారం రోజుల్లో మిగతా ఎరువులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

గరివిడి: యూరియా వాడకంపై రైతులకు అవగాహన సదస్సు యంపిడిఒ సుబ్రహ్మణ్యం, వ్యవసాయ సంచాలకులు కోటేశ్వరరావు, ఎఒ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతుసేవా కేంద్ర పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లోనూ ఆర్‌ఎస్‌కె అసిస్టెంట్లు గ్రామ సభలను నిర్వహించి రైతులకు యూరియా వాడకంపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. జిల్లాకు మన అవసరాలకు సరిపడా యూరియాను ప్రభుత్వ కేటాయించిందని మరో రెండు రోజుల్లో 2000 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందన్నారు.

సంతకవిటి: అధిక యూరియా వాడకం వల్ల వరి పంటకు పురుగు ఉద్రిత ఎక్కువ అవుతుందని మండల స్పెషల్ ఆఫీసర్, డ్వామ పీడీ ఎస్.శారదాదేవి అన్నారు. ఆదివారం మండలంలోని బొద్దూరులో రైతుకు యూరియా - వ్యవసాయశాఖ హామీ అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులు యూరియాను తగిన మోతాది వినియోగించాలన్నారు. ఎంపిడిఒ కె.సురేష్ కుమార్, ఎఒ సిబి యశ్వంత్‌రావు, పిఎసిఎస్ చైర్మన్ మహేష్‌కుమార్, ఎపిఒ హరినాథ్, ఆర్‌ఐ కృపారావు, పాల్గొన్నారు.

శృంగవరపుకోట: యూరియా సరఫరా పై రైతులు సందేహాలు పడవద్దని ఎఒ రవీంద్ర అన్నారు. యూరియాపై రైతులకు ఉన్న సందేహాలు తీర్చేందుకు మండలంలోని సంత గౌరమ్మపేట, గోపాలపల్లి, సీతారాముపురంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. మండలంలో 48 ఎంటి యూరియా నిల్వ వుందని సోమవారం జెకె ట్రేడర్స్, కృష్ణ మోహంతిపురం పిఎసిఎస్, రైతు సేవా కేంద్రం వద్ద, పెద కండేపల్లి రైతు సేవా కేంద్రం, మూల బొడ్డవరలో 48 టన్నులు సరఫరా చేస్తామన్నారు.

వంగర: మండలంలోని సంగాం, అరసాడలో ఎంపిడిఒ ఎస్. రఘునాథ చారితో ఎఒ తట్టికోట కన్నబాబు ఆదివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిమితికి మించి యూరియా వాడకూడదన్నారు. కార్యక్రమంలో లచ్చుబుక్త కృష్ణమూర్తి, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: మండలంలోని పుర్రాయవలసలో ఆదివారం మండల వ్యవసాయాదికారి సూర్యకుమారి ఆధ్వర్యంలో రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు. యూరియాకి ప్రత్యామ్నాయంగా నానోయూరియా లిక్విడ్‌ని వాడడం వల్ల పంట బాగా పండి అధిక దిగుబడులు వస్తాయని సూచించారు.

విజయనగరంకోట: మండలంలోని కోరుకొండ, జొన్నవలస గ్రామాల్లో ఆదివారం యూరియా వినియోగంపై రైతులకు ఎఒ ఎ.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. అధికంగా యూరియా వినియోగం వల్ల అనర్థాలు, ముందే కొనుక్కొని నిల్వ చేయడం వల్ల కృత్రిమ కొరత ఏర్పడిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.